"కుడి అరసు" పత్రికలో చేరడం వలన కరుణానిధి పేరు, ప్రతిభ అందరికీ తెలియవచ్చాయి. పెరియార్‌కు చాలా ఆప్తుడయ్యాడు కూడా. అదే సమయంలో నాటకాలు రాయడం ద్వారా కరుణానిధికి మరింత పేరు వచ్చింది. అతను రాసిన "తూక్కు మేడై" (ఉరికంబం) అనే నాటిక అప్పటి ప్రఖ్యాత స్టేజి, సినిమా నటుడు ఎం.ఆర్. రాధా ప్రదర్శించడంతో కరుణానిధికి విపరీతంగా పేరు వచ్చింది. ఎం.ఆర్.రాధా కూడా కళగం సభ్యుడే. నాస్తికవాది. తన భావాలను అతి తీవ్రంగా వెలిబుచ్చే వ్యక్తి. తెరపై విలన్ పాత్రలు, హాస్యపాత్రలు వేశాడు. సమాజానికి విమర్శించడానికి నాటకరంగాన్ని చాలా చక్కగా వినియోగించుకున్నాడు. "రక్తకన్నీరు" అనే నాటకంలో కుష్టురోగిగా సమాజాన్ని తూర్పారబట్టి చప్పట్లు కొట్టించుకున్నాడు. దాన్ని సినిమాగా కూడా తీశారు. ఆ సినిమాను తెలుగులో డబ్ చేయిస్తూ రాధాకు నాగభూషణం చేత డబ్బింగ్ చెప్పించారు. నాగభూషణం డైలాగ్ డెలివరీ అప్పటిదాకా మామూలుగానే వుండేది. కానీ ఆ సినిమాలో రాధా స్టయిల్లో డబ్బింగ్ చెప్పడం ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అప్పటినుండి దానికే అలవాటు పడ్డారు. అంతేకాదు "రక్తకన్నీరు" నాటకాన్ని తెలుగులో రాయించుకుని కొన్ని దశాబ్దాలపాటు తెలుగునాట ఆడి విపరీతంగా పేరు తెచ్చుకున్నారు. ఆ నాటకంలో రాధా ద్రవిడ సిద్ధాంతాల పరంగా సమాజాన్ని విమర్శిస్తే, కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైన నాగభూషణం తన పార్టీపరంగా సమాజాన్ని విమర్శించేవారు.

1967లో డిఎంకె అధికారంలోకి రావడానికి రాధా ఒక విధంగా దోహదపడ్డారు. డికె సభ్యుడిగా వుండే అతను, తమను వ్యతిరేకించిన డిఎంకె నాయకుడైన ఎంజీఆర్‌పై ఎన్నికల సమయంలో తుపాకీతో కాల్చి, ఆ పై తనను కాల్చుకుని జైలు కెళ్లాడు. ఎంజీయార్ చావుబతుకుల్లో వుండడంతో డిఎంకెకు సింపతీ ఓట్లు పడి వారు గెలిచారు. తన స్నేహితుడు, సహచరుడు అయిన ఎంజీయార్‌ను కాల్చినందుకు రాధా ఏ మాత్రం సిగ్గుపడలేదు. చాలా ఏళ్ల తర్వాత జైలు నుండి బయటకు వచ్చి "నేనే కాల్చా" అనే పేరుతో నాటకాలు ఆడాడు. తమాషా ఏమిటంటే తమిళ రాజకీయాల్లో యింత ప్రముఖ పాత్ర వహించిన రాధా కూడా తెలుగువాడే. ఆయన అసలు పేరు మద్రాసు రాజగోపాల రాధాకృష్ణ నాయుడు. ఆయన కూతురు, నటి అయిన రాధిక తన టీవీ ప్రొడక్షన్ కంపెనీ పేరు (రాదాన్) తండ్రి పేరులోని (రాధా, నాయుడు) పొడి అక్షరాలతో పెట్టుకుంది. తమిళ నాటకరంగాన్ని ఒక వూపు వూపిన ఎం ఆర్ రాధా, కరుణానిధి రాసిన నాటకం వేసి, అతని డైలాగులు పలకడంతో కరుణానిధి పేరు కూడా మారుమ్రోగిపోయింది. ఆ తర్వాత కరుణానిధి తమిళ సినిమాలకు కూడా రాసినపుడు అతని డైలాగులు శివాజీ గణేషన్, రాధా వంటి వారు అత్యంత మెలోడ్రమెటిక్‌గా పలికి ఎంతో పేరు తెచ్చుకున్నారు.


ఎం.ఆర్.రాధా

నిజానికి పెరియార్‌కు సినిమా రంగమంటే ఏ మాత్రం సదభిప్రాయం లేదు. విషప్రాయంగా చూసేవాడు. అయితే అన్నాదురైకు సినిమాలపట్ల యింత వెగటు లేదు. సినిమా అనేది ఎంత ప్రభావవంతమైన మాధ్యమమో ఆయన గుర్తించాడు. అప్పట్లో బ్రిటిషువారికి వ్యతిరేకంగా దేశభక్తి వ్యాప్తి చేయడానికి కొందరు సినిమాను ఎలా వాడుకుంటున్నారో గమనించి ద్రవిడ సిద్ధాంతాలను వ్యాప్తి చేయడానికి కూడా వెండితెరను వాడుకోవడంలో తప్పు లేదని ఆయన భావించాడు. నాటకరచయితగా లబ్ధప్రతిష్టుడు కాబట్టి ఆయనను కూడా సినిమారంగం ఆహ్వానించింది. ఆయన మరణానంతరం కూడా ఆయన కథలపై ఆధారపడి సినిమాలు తయారయ్యాయి. డిఎంకె వారు ప్రజలకు చేరువ కావడానికి కారణం – సినిమాలే ! శివాజీ గణేషన్ కూడా మొదట్లో డిఎంకె సభ్యుడే. కరుణానిధి రాసిన డైలాగులు ఉరుము ఉరిమినట్లు చెప్పగలిగిన అతని ప్రతిభ గురించి యిప్పటికీ చెప్పుకుంటారు. తర్వాత కొన్ని రాజకీయాల కారణంగా శివాజీ కాంగ్రెస్ వైపు మళ్లారు. అది తర్వాత చెప్పుకుందాం.

కుడి అరసు పత్రికాఫీసులో పని చేసే రోజుల్లో కరుణానిధి రచనాపాటవం చూసి ఉద్యోగం వదిలి తమతో పాటు నాటకాలాడమని రంగస్థల కళాకారులు ఆహ్వానించారు. కరుణానిధి రాసిన నాటకాలలో చెప్పుకోదగ్గవి – "మణిమకుటం", "ఒరే రత్తం" (ఒకటే రక్తం), "పళనియప్పన్", "తూక్కు మేడై", "కాగిత పూ" (కాగితపు పూవు), "నానే అరివాళి", (నేనే మేధావిని) "వెళ్లికిళమై", (శుక్రవారం) "ఉదయసూర్యన్", "శిలప్పదికారం". నాటకాల్లో ఆత్మతృప్తి వుంటుంది కానీ కాసులు రాలవు. అప్పటికే పెళ్లి చేసుకుని కాపురం పెట్టిన కరుణానిధికి డబ్బు విలువ కూడా తెలిసి వచ్చింది కాబట్టి అటు వెళ్లలేదు. కానీ సినిమారంగంలో ఆఫర్ సంగతి వేరు. అక్కడ డబ్బు బాగా వస్తుంది. అందుకని కరుణానిధి అటు వెళ్లారు. అది ఆయన జీవితంలో గొప్ప మలుపు. కరుణానిధి పేరు అందరికీ తెలియడానికి సినిమాలు చాలా బాగా వుపయోగపడ్డాయి. ఆయన రచన (కథ, డైలాగులు, స్క్రీన్‌ప్లే) చేసిన సినిమాలలో మొదటిది "రాజకుమారి" (1947) కాగా, యిప్పటికి కూడా కరుణానిధి సినిమాలకు రాయడానికి సై అంటారు. ఆ మధ్యే కాలేజి యువతరం సినిమాకు రచన చేశారు.

మొత్తం మీద 75 సినిమాల దాకా ఆయన స్క్రిప్టులు రాశారు. వాటిలో చెప్పుకోదగినవి – "అభిమన్యు" "మంత్రి కుమారి" (తెలుగులో "వీరకంకణం"), "మరుదనాట్టు ఇళవరసి" (మరుదనాడు యువరాణి), "మన్‌మగన్" "దేవకి", "పరాశక్తి" (ఇది శివాజీ గణేశన్ తొలి చిత్రం. సూపర్ హిట్. దీనిలో డైలాగులతో శివాజీ తారాపథంలో దూసుకుపోయారు. దీనిలో డైలాగులు అప్పచెప్పేవారు యిప్పటికీ వేలాది సంఖ్యలో కనబడతారు), "పణం" (డబ్బు), "తిరుంబి పార్" (తిరిగి చూడు), "నామ్" (మనం), "మనోహర" (ఇది



"పరాశక్తి" (శివాజీ గణేశన్ తొలి చిత్రం)

ఎల్.వి.ప్రసాద్ డైరక్షన్‌లో శివాజీ, గిరిజ హీరో హీరోయిన్లుగా, టి ఆర్ రాజకుమారి వ్యాంప్‌గా తయారైంది. సూపర్ హిట్. తెలుగు డబ్బింగ్‌లో శివాజీకి జగ్గయ్య కంఠానిచ్చారు. ఈ డబ్బింగు సినిమా డైలాగులే రికార్డుల రూపంలో వెలువడి బ్రహ్మాండంగా అమ్ముడు పోయాయంటే కరుణానిధి కలంబలం ఎటువంటిదో అంచనా వేయవచ్చు), "మలై కల్లన్" (తెలుగులో "అగ్గిరాముడు), "రంగూన్ రాధా", "పుదుమై పిత్తన్" (కొత్త పిచ్చివాడు), "కురవంజి", "తాయిల్ల పిళ్లయ్" (తల్లిలేని కొడుకు), "కంచి తలైవన్", "పూంపుహార్", "మణిమకుటం", "మరక్క ముడియుమా?" (మర్చిపోగలమా), "పూక్కారి" (పుష్పలావిక), "నీతిక్కు దండనై" (నీతికి దండన)... యిలా ఎన్నో హిట్ సినిమాలు రాశారు. వీటిలో సాంఘికాలు, జానపదాలు, చారిత్రాత్మకాలు వున్నాయి. సినిమా ఏదైనా సరే సంఘంపై విసుర్లు, అతిశయోక్తులతో, ఉపమానాలతో సుదీర్ఘసంభాషణలు తప్పనిసరి.

కరుణానిధిని సినిమారంగానికి ఆహ్వానించిన జూపిటర్ పిక్చర్స్ వారు కోయంబత్తూరులోని తమ స్టూడియోలో వుండి రాయాలన్నారు. బెదురుతూ బెదురుతూనే కరుణానిధి పెరియార్ ఆశీర్వాదం కోరారు. సినిమాలంటే అసహ్యం వున్నా కరుణానిధిపై అభిమానంతో, అతని ఆర్థిక అవసరాల పట్ల అవగాహనతో పెరియార్ ఆశీర్వదించారు. "రాజకుమారి" (1947) సినిమాకై కోయంబత్తూర్ బయలుదేరిన కరుణానిధికి అక్కడ ఒక యువకుడు పరిచయమయ్యాడు. అతనితో స్నేహం, ఆ పై విరోధం కరుణానిధి జీవితాన్నే కాదు, తమిళనాడు రాజకీయాలనే ప్రభావితం చేశాయి. ఆ యువకుడే ఎంజీయార్ ! అతని కథ వచ్చే శుక్రవారం. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**